# మెంతులు

దీనిని ఆకుకూరగాను, గింజలను పచ్చళ్ళలోను ఉపయోగిస్తారు.

**వాతావరణం :** చల్లని వాతావరణం, తక్కువ ఉష్ణోగ్రత మరియు తగినంత మంచు అనుకూలం. గింజల కోసం అయితే రబీ కాలంలో, ఆకు కూరగా సంవత్సరమంతా నీటి పారుదల కింద పండించవచ్చు.

**నేలలు :** వర్షాధారం కింద నల్లరేగడి నేలల్లో, నీటి వసతి కింద గరపనేలలు, ఎర్రనేలలు మరియు ఇతర తేలిక పాటి నేలల్లో సాగుకు అనుకూలం. అధిక ఆమ్ల, క్షార లక్షణాలు గల భూములు పనికి రావు. 6.0-7.0 ఉదజని సూచిక కలిగిన సారవంతమైన ఇసుక నేలలు మరియు మురుగు నీటి వసతి గల ఒండ్రునేలలు అనుకూలం.

**విత్తే కాలం :** గింజల కొరకు అక్టోబరు 15 నుండి నవంబరు 15 వరకు, ఆకుకొరకు సంవత్సరమంతా విత్తుకోవచ్చు.

**రకాలు**

| రకం | పంటకాలం (రోజులు) | దిగుబడి (క్వి/ఎకరానికి) | | గుణగణాలు |
|---|---|---|---|---|
| | | వర్షాధారం | నీటివసతి | |
| లాంసెలక్షన్-1 | 80 | 3.0 | 6.0 | ఆకుకు, గింజకు పనికి వచ్చే రకం 5-6 కొమ్మలతో గుబురుగా ఉంటుంది. |

జె.యఫ్-210, జె.యఫ్-102 కూడా మన రాష్ట్ర వాతావరణానికి అనుకూలం.

**విత్తటం :** నల్లరేగడి నేలల్లో ఎకరానికి 12 కిలోల విత్తనం వాడి, గొర్రుతో వరసకు వరసకు మధ్య 30 సెం.మీ. వరసలో మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. తేలిక నేలల్లో ఎకరానికి 6 కిలోల విత్తనం వాడి, పైన తెల్పిన దూరంలో విత్తుకోవాలి. విత్తేముందు 1 గ్రా. కార్బండైజిమ్ కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి

చేసుకోవాలి. ఎకరానికి 600 గ్రా॥ చొప్పున రైజోబియం కల్చర్ తో విత్తన శుద్ధి చేయటం వలన దిగుబడులు పెరుగుతాయి.

**ఎరువులు :** ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువుతోబాటు, 20 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 35 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను వేసుకోవాలి. ప్రతి ఆకుకోత తర్వాత 40 కిలోల అమ్మోనియం సల్ఫేటు వేసి నీరు కట్టాలి.

**అంతర కృషి :** విత్తిన వెంటనే పెండిమిథాలిన్ బరువైన నేలల్లో అయితే ఎకరానికి 1.3 లీ., తేలిక నేలల్లో అయితే 1 లీ. 200 లీ. నీళ్ళలో కలిపి పిచికారి చేసుకొని మొదటి నెల వరకు కలుపు నివారణ చేసుకోవచ్చు. విత్తిన 15-20 రోజులకు ఒకసారి కలుపు తీసి మరో 15-20 రోజులకు గొర్రుతోగాని, దంతితోగాని అంతరకృషి చేయాలి.

## సస్యరక్షణ

**పురుగులు :** ఈ పంటను సాధారణంగా పేనుబంక, ఆకు తినే పురుగులు, మిడతలు ఆశిస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి డైమిథొయేట్ 2.0 మి.లీ. లేదా ఎండోసల్ఫాన్ 2 మి.లీ. కలిపి పిచికారి చేయాలి. రబ్బరు పురుగు ఆకులను, రెమ్మలను తిని వేస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు :** మొక్కల లేత దశలో వడలు తెగులు (డాంపింగ్ ఆఫ్) ఆశిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 3గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలి. పూత, కాత దశలో బూడిద తెగులు ఆశిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 3గ్రా. నీటిలో కరిగే గంధకం పొడిని పంట నెల రోజుల వయసప్పుడు 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి లేదా ఎకరానికి 10 కిలోల గంధకపు పొడిని చల్లి నివారించవచ్చు.

**కోత, దిగుబడి :** కాయలు గడ్డి రంగుకు మారినప్పుడు మొక్కలను పీకి పొలంలోనే 2-3 రోజులు ఎండనివ్వాలి. ఎండిన తర్వాత నూర్చుకొని, గింజలను ఎండబెట్టి సంచుల్లో నిలవ చేసుకోవాలి.

**ఆకుకూర కొరకు :** విత్తిన 25-30 రోజులకు మొదటి కత్తిరింపు తీసుకోవాలి. అటు తర్వాత ప్రతి 12-15 రోజులకు ఒక కత్తిరింపు చొ॥న తీసుకోవాలి. 2-3 కత్తిరింపుల తర్వాత మొక్కలను గింజల కోసం వదిలి పెట్టాలి.

**గింజల కొరకు :** గింజలు విత్తిన 5-6 వారాల తర్వాత పూత ప్రారంభమై 10-11 వారాల్లో కోతకు సిద్ధమవుతుంది. కాయలు గడ్డి రంగుకు మారినపుడు మొక్కలను పెరికి, పొలంలో 2-3 రోజులు ఎండనివ్వాలి. తర్వాత కాయలను కర్రలతో కొట్టి, గింజలను తీసి, శుభ్రపరిచి గోనె సంచుల్లో నిలవ చేయాలి.

### దిగుబడి

**ఆకుకూర దిగుబడి :** నీటి పారుదల కింద ఎకరానికి 4,0 నుండి 5 టన్నుల దిగుబడి వస్తుంది, దేశవాళీ రకాలు ఎకరానికి 2800-3200 కిలోలు (3-4 కత్తిరింపుల్లో) యిస్తాయి.

**గింజల దిగుబడి :** వర్షాధారం కింద ఎకరానికి 3-3.5 క్వింటాళ్ళు దిగుబడి. నీటిపారుదల కింద ఎకరానికి 4-6 క్వింటాళ్ళ గింజల దిగుబడి వస్తుంది.

మెంతుల సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా 337 పేజీలో ఇవ్వబడింది